క్లుప్తంగా

వీరవల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్మీడియెట్ కోర్సులు ప్రారంభం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని లంక వీరయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియెట్ కోర్సులు ప్రారంభించనున్నట్లు హెచ్‌ఎం నిర్మల గురువారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సుల్లో ప్రవేశానికి ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభించినట్లు చెప్పారు. వీరవల్లి, పరిసర గ్రామాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెన్త్ తర్వాత ఇంటర్మీడియెట్ కోర్సు చదివేందుకు సుదూర ప్రాంతాలకు విద్యార్థులు వెళ్లాల్సి రావడంతో ప్రభుత్వం వీరవల్లి హైస్కూల్‌ను అప్‌గ్రేడ్ చేసినట్లుగా ఆమె వివరించారు.

తాగునీటికి అడ్డంకులు లేకుండా చర్యలు



పెనమలూరు: దిగువ ప్రాంతాలకు కాలువల్లో వదిలిన తాగునీరుకు ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిగువ ప్రాంత ప్రజల కోసం కృష్ణానది నుంచి కాలువలకు తాగునీరు విడుదల చేశారన్నారు. కాలువలో పారే నీటికి స్థానికంగా ఎటువంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శివారు ప్రాంతాలకు నీరు చేరే విధంగా తమ వంతు కృషి చేయాలని తెలిపారు. ఎండల తీవ్రత బాగా పెరుగుతున్నందున ముఖ్యప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు కూడా ఎండ తీవ్రత వల్ల కలిగే ఇబ్బందులపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్లు శ్రీనివాసరావు, భవాని పాల్గొన్నారు.

మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు

గన్నవరం రూరల్: మామిడి పిందెలు సైజు పెరిగేందుకు తేలికపాటి నీటి తడులు ఇవ్వాలని మండల ఉద్యానవన అధికారి హరిచంద్ సూచించారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో సస్యరక్షణ చర్యలతో తామర పురుగులు నివారించాలని చెప్పారు. తామర పురుగు కనపడితే ఫిప్రోనిల్ రెండు మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని అన్నారు. తేనె మంచు పురుగు నివారణకు క్లోరిపైరిపాస్ 2.5 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకుంటే సస్యరక్షణతో పిందెలు సైజు పెరిగి రాలడం ఆగిపోతుందని వివరించారు.

రేపటి నుంచి సమ్మెటివ్-2 పరీక్షలు

కంకిపాడు: సమ్మెటివ్-2 పరీక్షలను శనివారం నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాశాఖాధికారి కేఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు శనివారం నుంచి 13వ తేదీ వరకూ, ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు శనివారం నుంచి 18వ తేదీ వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతి రోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష ఉంటుందని, పరీక్షలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంలకు సూచించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు శనివారం నుంచి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు బాపులపాడు ఎంఈఓ శ్రీరామ్‌బాలాసింగ్ గురువారం తెలిపారు. ఇప్పటికే మండల కేంద్రానికి ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు వచ్చాయని చెప్పారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట



ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ పంచ పట్టాభిరామస్వామి ఆలయాల పునఃప్రతిష్టా మహోత్సవం గురువారం వైభవంగా సాగింది. ఆగమ పండితుడు డాక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి పర్యవేక్షణలో వేదపండితులు నూతనంగా నిర్మించిన గర్భాలయంలో వేణుగోపాల స్వామి, పంచ పట్టాభిరామస్వామి విగ్రహాలను ప్రతిష్టించారు. రెండు ఆలయాల వద్ద ధ్వజస్తంభాలను ప్రతిష్టించారు. వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆగమ శాస్త్రం ప్రకారం యజ్ఞాలను నిర్వహించి విగ్రహ ప్రతిష్ట, పూజా కార్యక్రమాలు జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ లోయ చింతయ్య, ఈఓ శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామివార్ల శాంతి కల్యాణం వైభవంగా జరిపించారు.

జగనన్నతోనే సంక్షేమ పథకాల కొనసాగింపు

మంత్రి జోగి రమేష్



తాడిగడపలో ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: రానున్న ఎన్నికల్లో తిరిగి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపిస్తేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగుతాయని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. తాడిగడప శ్రీనివాసనగర్ కాలువ కట్టపై నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రమేష్ మాట్లాడుతూ జగనన్న పాలనలో నవరత్నాలు అమలు చేసి పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆదుకున్నారన్నారు. పేద కుటుంబాల బ్యాంకు ఖాతాలో సొమ్ము నేరుగా వేసి సాయం అందించారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అత్యంత పారదర్శకంగా అమలు చేశారని, కులమత, రాజకీయాలకు అతీతంగా పథకాలు ప్రతీ కుటుంబానికి చేరాయని తెలిపారు. జగనన్నను గెలిపిస్తే రానున్న ఐదు సంవత్సరాలు ప్రజలకు సంక్షేమ పాలన అందుతుందని వివరించారు.

పేదలంటే చంద్రబాబుకు కడుపు మంట..

పేద ప్రజలంటే చంద్రబాబుకు కడుపు మంటగా ఉందని మంత్రి జోగి రమేష్ ఆరోపించారు. అవ్వాతాతలకు, వితంతువులు, అంగవైకల్యం చెందిన వారితో పాటు పలువురికి ప్రతీ నెల పింఛన్ వలంటీర్‌లు ఇళ్లకు వెళ్లి వేకువజామునే అందించడం చంద్రబాబు ఓర్వలేక పోయాడని విమర్శించారు. అందుకే ఈసీకి ఫిర్యాదు చేసి వలంటీర్‌లను ఆపారని, ఇంతా చేసి సిగ్గు లేకుండా ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నాడని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలని, ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి జగనన్నను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, నేతలు జిన్నా, శ్రీకాంత్‌రెడ్డి, కాకి శ్రీనివాసరావు, మాణిక్యపల్లి శ్రీనివాసరావు, అద్దేపల్లి చందు, ఈదే రాజేష్, జైకిషోర్, వరప్రసాద్, సాంబయ్య, అర్షద్, ముజీబ్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి జోగి రమేష్



తాడిగడపలో ఇఫ్తార్ విందులో మంత్రి జోగి రమేష్

రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్ గురువారం పలు ప్రాంతాల్లో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లో ముస్లిం సోదరులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మంత్రి జోగి రమేష్ ఇఫ్తార్ విందులో పాల్గొని తొలుత ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థన చేశారు. ప్రతీ ఒక్కరు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెనమలూరు నియోజకవర్గ పరిశీలకుడు రామసుధీర్, తాడిగడప మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి జగనన్నను గెలిపించుకుందాం



కొయ్యగూరపాడులో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు

ఉంగుటూరు: రాజకీయ వివక్ష లేకుండా అర్హులందరికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని పిలుపునిచ్చారు. కొయ్యగూరపాడులో గురువారం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పని చేసిన జగనన్నను అఖండ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని చెప్పారు. సంక్షేమం పొందిన ప్రతీ కుటుంబం ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల జనరల్ సెక్రటరీ జాజుల కిషోర్, ఆముదాలపల్లి సచివాలయ కన్వీనర్ సాయిల కరుణాకర్, పీఏసీఎస్ చైర్మన్ తోట శ్రీనివాసరావు, నాయకులు గోళ్ల కృష్ణారావు, నాగమల్లేశ్వరరావు, విద్యాసాగర్‌రావు, వేంపాడు పీఏసీఎస్ చైర్మన్ సోమేశ్వరరావు, శామ్యూల్ పాల్గొన్నారు.

ఘనంగా డీపీఎస్‌లో స్నాతకోత్సవం



విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేస్తున్న సునంద తదితరులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో స్నాతకోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్లస్‌టు పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను పాఠశాల ఫస్ట్ లేడీ పరిమి సునంద చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డేవిడ్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని భవిష్యత్‌లో ఎటువంటి సమస్యనైనా అధిగమించే ధైర్యాన్ని కలిగి ఉండాలన్నారు. వీఐటీ ఏపీ స్కూల్ ఆఫ్ లా డీన్ బెనర్జీ మాట్లాడుతూ విద్యార్థులు కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేసి భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే విధంగా తమ తమ ఆలోచనలు మలుచుకోవాలని, అంతరాలను రూపుమాపే వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు పరిమి పవన్‌చంద్, కడియాల ప్రవీణ్, పాఠశాల ప్రిన్సిపాల్ భువనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్‌భాటియా, ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెత్తందారి ఆటలు ఇక్కడ సాగవు

వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు

ఉయ్యూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బోడె లాంటి పెత్తందారుల ఆటలు సాగవని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఉయ్యూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, మున్సిపల్ వైస్‌చైర్మన్ సోలే సురేష్‌బాబు, ఎస్సీ నాయకులు గెత్తం విజయ్‌కుమార్, రమావత్ శ్రీకాంత్, బ్రహ్మం, మైనార్టీ విభాగం నాయకుడు సలీం బేగ్ మాట్లాడుతూ పింఛన్ల పాపం చంద్రబాబుది కాదా? అని ప్రశ్నించారు. నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఎవరి మనిషి అనేది అందరికీ తెలుసన్నారు. చంద్రబాబు దుర్మార్గపు రాజకీయం వల్లే పింఛన్ పంపిణీలో ఇబ్బందులు తలెత్తి అవ్వాతాతలు చనిపోతున్నారన్నారు. గంగూరులో పింఛన్ లబ్ధిదారు మృతికి టీడీపీనే కారణమని పేర్కొన్నారు. అవ్వాతాతలు, దివ్యాంగులను ఇబ్బందులు పెడుతూ ఏమీ తెలీనట్లు బోడె వచ్చి శవ రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. బలహీన వర్గాలకు చెందిన మంత్రి జోగి రమేష్‌ను అగ్రవర్ణ అహంకార ధోరణితో బెదిరింపులకు దిగితే చూస్తూ ఊరుకోమన్నారు. పెత్తందారీ పోకడలు పెనమలూరులో సాగవన్నారు. మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పెనమలూరు ప్రజలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, కౌన్సిలర్లు గుంజా సుధాకర్, గోన మదన్, బేగ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎండ తీవ్రతపై చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ కుమార్‌బాబు

పెనమలూరు: ఎండ తీవ్రత బాగా పెరిగినందున గ్రామాల్లో తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు అన్నారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రత బాగా పెరుగుతుందని వాతావరణ శాఖ తెలుపడంతో గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ గ్రామ పంచాయతీ ప్రాంతంలో చలివేంద్రాలు ప్రారంభించాలని అన్నారు. చలివేంద్రాల వద్దే ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి పనులు చేసే ప్రాంతంలో కూలీలకు మజ్జిగ, మంచినీరు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ ప్రసాద్, ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలో మరచిపోయిన బ్యాగ్ అప్పగింత



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రయాణికురాలు ఆటోలో మరచిపోయిన దుస్తుల బ్యాగ్‌ను అప్పగించిన ఘటన గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం... సయ్యద్ ఇర్షద్ బందర్ రోడ్ లోని శుభమస్తు షాపింగ్ మాల్‌లో పని పూర్తి చేసుకుని ఆటో ఎక్కింది. చల్లపల్లి బంగ్లా వద్ద ఆటో దిగి వెళ్లిపోయింది. ఆటోలో షాపింగ్ చేసిన బట్టల బ్యాగ్ మరిచిపోయి వెళ్లిపోయింది. తర్వాత బ్యాగ్ మరచిపోయిన విషయాన్ని గుర్తించి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తక్షణమే స్పందించిన సీఐ వెంకటరమణ, ఎస్సై నారాయణమ్మ ఆటోను గుర్తించారు. ఆటోలో ఉన్న బ్యాగ్‌ను గుర్తించి మహిళకు అందజేశారు.

నేడు వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. అసోసియేషన్ సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

మహిళా సమాఖ్య బుక్ కీపర్‌పై ఫిర్యాదు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం సిరివాడ గ్రామ మహిళా సమాఖ్య బుక్ కీపర్ పి.ఝాన్సీపై సొమ్ము డ్వాక్రా గ్రూపు సభ్యురాలు సంగతి సుమిత్ర ఫిర్యాదు చేశారు. బుక్ కీపర్ ఝాన్సీ తరుచూ డ్వాక్రా గ్రూపు సభ్యుల నుంచి నగదు వసూలు చేస్తున్నారని, ప్రశ్నించిన సభ్యుల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటూ ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై బాపులపాడు ఎంపీడీఓ రత్నకుమారి వైఎస్సార్ క్రాంతిపథం ఏరియా కోఆర్డినేటర్‌ను విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు.

వైఎస్సార్ సీపీ ఘన విజయమే లక్ష్యం

గన్నవరం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని ఎంపీపీ అనగాని రవి సూచించారు. మండలంలోని సూరంపల్లి గ్రామంలో గురువానం జరిగిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ ఇచ్చిన వైఎస్సార్ సీపీ గొప్పదనం గ్రామస్తులకు వివరించాలని చెప్పారు. ప్రతీ కార్యకర్త అంకిత భావంతో పని చేసి మరలా వైఎస్సార్ సీపీని అధికారంలోకి తేవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలను కన్నబిడ్డల వలే కాపాడారని పేర్కొన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, సహకార బ్యాంకు అధ్యక్షుడు తుల్లిమిల్లి ఏడుకొండలు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, సీనియర్ నాయకులు బండి శివరామయ్య, కందిమళ్ల శ్రీనివాసరావు, రాఘవ, భూక్యా కోటేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భార్యపై కోడికత్తితో దాడి

గన్నవరం: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపై భర్త కత్తితో దాడి చేసిన సంఘటనపై గన్నవరం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. స్థానిక గౌడపేటకు చెందిన మసిముక్క వెంకటేశ్వరరావుకు పదేళ్ల క్రితం వడ్డీకాసులతో వివాహం జరిగింది.

ఇరువురి మధ్య గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం వీరి మధ్య మాటమాట పెరిగి వివాదానికి దారితీసింది. దీంతో ఆగ్రహానికి గురైన వెంకటేశ్వరరావు కోడికత్తితో భార్యపై దాడి చేశారు. ఈ ఘటనలో భార్య వడ్డీకాసులతో పాటు సమీప బంధువైన రాజ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. గాయపడిన ఇరువురిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సామాజిక బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ



గన్నవరం: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని ఏపీ ఎన్జీసీ జిల్లా కోఆర్డినేటర్ కొమరగిరి అన్నపూర్ణ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ నానాటికి పెరుగుతున్న వాతావరణ కాలుష్యం కారణంగా సమస్త ప్రాణకోటి మనుగడ ప్రమాదకరంగా మారిందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడంతో పాటు విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం నిమ్మగడ్డ రవీంద్రభవాని, ఉపాధ్యాయులు ఝాన్సీ, సునీత, నాగరాజు, షేక్ మీరాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలోనే అభివృద్ధి



పాతపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వంశీమోహన్



వైఎస్సార్ సీపీలో చేరిన ఎమ్మార్పీఎస్ నాయకుడు కిషోర్ తదితరులు

గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీ మోహన్

పాతపాడు(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సంక్షేమం, అభివృద్ధి దిశగా పాలన సాగుతుందని గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం విజయవాడ రూరల్ మండలం పాతపాడు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. గ్రామంలో ప్రచారానికి విచ్చేసిన వంశీమోహన్‌కు గ్రామస్థులు పూలు జల్లుతూ అడుగడుగునా స్వాగతం పలికి, గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మేలు చేసే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకు వచ్చేందుకు అందరం కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికీ వెళ్లిన ఆయన కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను అడిగి మన ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మార్పీఎస్ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి పేటేటి కిషోర్ మాదిగ, మరి కొంత మంది మాదిగలు వంశీమోహన్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి వంశీ వైఎస్సార్ సీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రచారంలో గ్రామ సర్పంచి దేవగిరి సుజాత, ఎంపీటీసీ సభ్యులు మరీదు బాలకోటేశ్వరావు, బొంతు సరోజిని, దూరు రత్నం, పార్టీ మండల అధ్యక్షుడు దేవగిరి ఓంకార్‌రెడ్డి, మండల కన్వీనర్ శీలం రంగారావు, గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరావు, జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్మారెడ్డి నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ గన్నవరం ఎలక్షన్ ఇన్‌చార్జి ఆర్‌వీఆర్, జిల్లా కార్యదర్శి సమ్మెట సాంబశివరావు, గ్రామ పార్టీ కన్వీనర్ మందా శివరాజు, దళిత నాయకులు కలపాల అబ్రహం, సందీప్‌కుమార్, భాస్కర్, కిషోర్, సురేష్ పాల్గొన్నారు.

పింఛన్ కోసం తప్పని తిప్పలు



పోరంకిలో పింఛన్ కోసం వచ్చిన లబ్ధిదారులు



పోరంకిలో పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు: రెండో రోజు కూడా పింఛన్ కోసం లబ్ధిదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రంగా ఉండటంతో వృద్ధులు అల్లాడిపోయారు. పైగా సచివాలయాల్లో రద్దీ ఏర్పడటంతో పింఛన్ పంపిణీ ఆలస్యంగా జరిగింది. చంద్రబాబు అండ్ కో ఫిర్యాదుతో ఈసీ వలంటీర్లను విధుల నుంచి తప్పించడంతో ఈ నెల సామాజిక పింఛన్ పంపిణీ సమస్యగా మారింది. మండలంలో సామాజిక పింఛన్ లబ్ధిదారులు 18,791 మంది ఉండగా వారికి రూ. 5,64,62,000 సొమ్ము పంపిణీ చేయాల్సి ఉంది. వలంటీర్లు ఉంటే ఈ సొమ్ము మొదటి రోజే 90 శాతం మేరకు పంపిణీ చేసేవారు. అయితే పెనమలూరు మండలంలో రెండో రోజుకు 75 శాతం, తాడిగడప మున్సిపాలిటీలో 65 శాతం మేర మాత్రమే పింఛన్లు పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది బ్యాంకు నుంచి సొమ్ము తీసుకురావడం, వారే లెక్కలు చూసుకుని మరల పింఛన్లు పంపిణీ చేయడంతో జాప్యం జరుగుతోంది. సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీలో తమ వంతు కృషి చేస్తున్నా సమస్యలు అధిగమించలేక పోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు.

ఎండ తీవ్రత..

ఎండ తీవ్రతతో వృద్ధులు చాలా ఇబ్బందులు పడ్డారు. కష్టపడి సచివాలయం వద్దకు వచ్చిన తర్వాత పింఛన్ పంపిణీ జాప్యం జరగడంతో వృద్ధులు విలవిల్లాడారు. సచివాలయాల వద్ద షామియానాలు, తాగునీరు ఏర్పాటు చేసిన ఎండ తీవ్రతకు వృద్ధులు తట్టుకోలేకపోతున్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలించిన కమిషనర్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో సామాజిక పింఛన్ల పంపిణీని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పరిశీలించారు. పోరంకి ప్రాంతంలోని పలు సచివాలయాలను గురువారం ఆయన సందర్శించారు. లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు పంపిణీ సక్రమంగా జరుగుతుందా లేదా అనే విషయం లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సచివాలయం సిబ్బందితో మాట్లాడారు. పింఛన్ల పంపిణీలో ఎటువంటి జాప్యం చేయరాదని ఆదేశించారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పింఛన్ పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. షామియానాలు వేసి, తాగు నీరు అందుబాటులో ఉంచామన్నారు. పింఛన్లు కూడా జాప్యం లేకుండా పంపిణీ చేస్తున్నారని తెలిపారు. వివిధ కారణాల వల్ల సచివాలయానికి రాని వారి వివరాలు సేకరించామని వారికి మాత్రం సిబ్బంది ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

యూజర్‌చార్జీలు చెల్లించాలంటూ అధికారుల వేధింపులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మ్యాంగో గ్రోయర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయవాడరూరల్: నున్న గ్రామంలోని మ్యాంగో మార్కెట్లో గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగులు యూజర్‌చార్జీలు చెల్లించాలంటూ వేధింపులకు గురి చేస్తున్నారని మ్యాంగో గ్రోయర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ షేక్ దరియా, కార్యదర్శి ఐ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. నున్న మ్యాంగో మార్కెట్ అసోసియేషన్ హాలులో గురువారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బుధవారం మార్కెట్లో ఉత్తరభారత దేశం వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న మామిడి కాయల లారీని ఆపివేసి ఒక శాతం యూజర్‌చార్జీలు చెల్లించాలంటూ నానా యాగీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. యూజర్‌చార్జీలు చెల్లింపునకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు ఉంటే ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా సమాధానం ఇవ్వగలమన్నారు. అంతేకాని రైతులు మామిడి కాయలతో మార్కెట్‌కు వచ్చే సందర్భాల్లో ఉద్యోగులు మార్కెట్లోకి వచ్చి వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. 2013వ సంవత్సరంలో సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కూరగాయలు, పండ్లపై మార్కెట్ సెస్సు తొలగించడం జరిగిందని, దాని ప్రకారం మార్కెట్ సెస్సు చెల్లించే అవకాశం లేదని పేర్కొన్నారు. విలేఖరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు, ముఠామేస్త్రి బోను శ్రీరాములు పాల్గొన్నారు.